చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే

బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు


బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ స్కానర్‌ను ఆవిష్కరించిన మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పేవన్నీ అబద్ధాలేనని విజయవాడ సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. అధికారంలోకి రావడం కోసం అడ్డగోలు హామీలిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా హామీలు చూస్తే భయమేస్తోందంటూ తప్పుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. శుక్రవారం సూర్యారావుపేటలోని 23వ డివిజన్ శివారెడ్డి కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో పేరిట బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కానర్‌ను విడుదల చేశారు. వైఎస్ జగన్ ప్రెస్‌మీట్ వీడియో ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. చదువుద్వారానే పేదరికం దూరం అవుతుందని, ఆత్మగౌరవం పెరుగుతుందని నమ్మి అందరికి విద్య నందించే లక్ష్యంతో అమ్మ ఒడి కార్యక్రమం చేపట్టారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందించారన్నారు. నవరత్న పథకాలను తప్పక అమలు చేశారన్నారు. రాష్ట్రాన్ని గతంలో ఎంతో మంది ముఖ్యమంత్రులు పాలించారని, ఏ ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాదిరి సంక్షేమం కోసం పాటుపడలేదన్నారు. అంతటి సంక్షేమం, అభివృద్ధి చేసిన వైఎస్ జగన్‌పై చంద్రబాబు తన అనుకూల మీడియాలో దుష్ప్రచారం చేశారన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించారన్నారు. చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనన్నారు. వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాలకే పేర్లు మార్చి తాను పెట్టినట్లు ప్రజలను ఏమారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మ ఒడి పథకానికి తల్లికి వందనం అనిపేరు పెట్టి ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చాడన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అరకొరగా ఇచ్చి అందులోనూ కోత విధించారన్నారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిగా ఇస్తామని, ఆడబిడ్డ నిధి ఇస్తామని, విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల హామీలు ఇచ్చారన్నారు. విద్యుత్ చార్జీలు అడ్డగోలుగా పెంచేశారన్నారు.

మోసపుమాటలతో....

వలంటీర్లకు రూ. 10వేలు ఇస్తామని నమ్మించి వారిని పూర్తిగా మోసం చేశారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇద్దరి సంతకాలతో బాండ్లు జారీ చేశారని గుర్తు చేశారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అనే నినాదంతో ప్రజలకు మోసపు మాటలు చెప్పారన్నారు. చంద్రబాబు అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాలను మోసం చేస్తున్నారన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదన్నారు. ఏడాది సుపరిపాలన పేరుతో ఊళ్లలోకి వెళ్లలేక అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు ముఖం చాటేశారన్నారు. అధికార పార్టీ నేతలకు ప్రజల వద్దకు వెళ్లే దమ్ము, ధైర్యం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాబూ ష్యూరిటీ మోసం గ్యారెంటీ నినాదంతో ప్రజల్లోకి పంపారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఈ డివిజన్‌లో ఇళ్లు లేని వారికి ఇళ్లు, ఆసరగా అమ్మ ఒడి, చేయూత, కాపు నేస్తం ఇలా ప్రతి ఒక్క పథకంలో అర్హులకు లబ్ధిచేకూరిందన్నారు. అగ్రకులాల్లోని పేదలకు సైతం ఈబీసీ నేస్తం ద్వారా లబ్ధిచేకూర్చిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని పేర్కొన్నారు. వైఎస్ జగన్ ఐదేళ్ల పాలన సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో డివిజన్‌లో ఏ ఒక్కరికైనా లబ్ధి చేకూరిందా అని ప్రశ్నించారు. క్లస్టర్ అధ్యక్షులు పిల్లుట్ల వంశీ, డివిజన్ నాయకులు చల్లా సుధాకర్, ఆత్మకూరి సుబ్బారావు, వడ్డీ రజనికాంత్, శేషన్ మురళి, సీతాదేవి, పార్టీ నాయకులు వెన్నా రత్నారావు, శివారెడ్డి, ఒగ్గు విక్కి, దుర్గారెడ్డి, వడ్డి వాసు, కుక్కల రమేష్, కె.శ్రీనివాసరావు, మహిళా విభాగం నాయకులు తోపుల వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



పాయకాపురం(విజయవాడరూరల్): వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలని జిల్లా మలేరియా ఆఫీసర్ మోతేబాబు సూచించారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా 64వ డివిజన్లో వైద్య, పారిశుధ్య సిబ్బంది పరిసరాల శుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పూలకుండీల్లో, పాతటైర్లలో, ఫ్రీజ్‌ల్లో నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో వైరల్ ఫీవర్స్ వచ్చిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని కోరారు. నిల్వ వున్న నీటిలో గంబూషియా చేపలు వదిలారు. దోమల పెరుగుదల వాటి నివారణ పై దోమల పుట్టుక పరిణామం విషయాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రజలు కాల్వల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపిరాజు, హెల్త్ సెక్రటరీలు, ఆశ వర్కర్లు, మలేరియా సిబ్బంది, కె.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు అన్నారు. సునీత ఈవెంట్స్ సాంస్కృతిక సంగీత, సాహిత్య సేవా సంస్థను గాంధీనగర్‌లోని ఆశిష్ స్టూడియోలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. నూతన గాయనీ గాయకులకు సంస్థలు అవకాశం ఇవ్వాలని సూచించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయాల చిట్టిబాబు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను వివరించారు. నిర్వాహకురాలు పసుపులేటి సునీత్ సంస్థ విజయవంతం కావాలని తెలిపారు. విశ్రాంత పోలీస్ అధికారి కె. డేవిడ్‌రాజు, బి.వీరభద్రరావు, చీదెళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు. గాయకుడు కేవీ రెడ్డి, సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావును నిర్వాహకులు సత్కరించారు.

వైభవంగా విఘ్నేశ్వర ఆలయ వార్షికోత్సవం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం, గిరి వీధిలో వేంచేసియున్న అభయ విఘ్నేశ్వర ఆలయం 27వ వార్షిక వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు రెండు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకల్లో సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆలయాన్ని సందర్శించి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు బి.వి బాలకోటేశ్వరరావు మాట్లాడుతూ 27 ఏడేళ్లుగా ఆలయంలో పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు రఘు, మూర్తి, కిషోర్, నారాయణ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పనులు పూర్తి కావాలి: ఈఓ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన ఇంజినీరింగ్ పనులు సకాలంలో పూర్తి కావాలని దుర్గగుడి ఈఓ శీనానాయక్ అధికారులను ఆదేశించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న పలు ఇంజినీరింగ్ పనులను ఈఓ శీనానాయక్, ఈఈ రాంబాబు, ఇతర అధికారులు శుక్రవారం పరిశీలించారు. మహామండపం ఎదుట నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనం, ప్రసాదాల పోటు, కనకదుర్గా నగర్‌లో లడ్డూ ప్రసాద విక్రయ కౌంటర్లను పరిశీలించారు. నూతన భవనాల్లో మురుగు నీటి పారుదల వ్యవస్థను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

మధురంగా సాగిన సంగీత కచేరీ


సంగీత కచేరీ నిర్వహిస్తున్న మూలా శ్రీలత వాద్యసహకారం అందిస్తున్న అరవింద్

విజయవాడ కల్చరల్: విఖ్యాత సంగీత విద్వాంసురాలు గద్దె రామకుమారి జయంతి సందర్భంగా స్వరఝరి సంగీత సంస్థ, హేమాద్రి మ్యూజిక్ అకాడమీ తెనాలి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం మూలా శ్రీలత నిర్వహించిన కర్ణాటక సంగీత కచేరి సంగీత అభిమానులను ఆలరించింది. రెండు గంటలపాటు సాగిన కచరీలో పలు సాంప్రదాయ కీర్తనలు చోటు చేసుకున్నాయి. శ్యామశాస్త్రి కీర్తన నీలయతాక్షి, త్యాగరాజ స్వామి కీర్తన చాలా కల్లాడు కొన్న, హైమవతి రాగంలో రాగం తానం పల్లవి, మండపాక శారద రచించిన తిల్లానా మధురంగా ఆలపించారు. కుందుర్తి అరవింద్, సింధురాగేశ్వరి వాద్య సహకారం అందించారు. వయొలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి రామకుమారి సంగీత సేలను వివరించారు. అంజనా సుధాకర్‌తోపాటు పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు. స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ నిర్వహించారు.

సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులు


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ


ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం


మారుతీనగర్‌లో గురువులను సత్కరించిన దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు తెలిపారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహితసదనంలో శుక్రవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలోని ఉపాధ్యాయులను శాలువా జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్లు శర్వాణీ మూర్తి, అలంపూర్ విజయ్, కుక్కల రమేష్, ఎర్రగొల్ల శ్రీరాములు, రాజా రమేష్, త్రివేణి రెడ్డి, ఝాన్సీ రాణి, రెడ్డి, చంద్రమౌళి, దోనేపూడి శ్రీనివాస్, తోపుల వరలక్ష్మి, పీ వంశీ, కాళ్ల ఆదినారాయణ, భోగాది మురళి,కె కొండలరావు తదితరులు పాల్గొన్నారు

మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలని అనాలోచిత నిర్ణయం తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ హయాంలో కేంద్రంతో మాట్లాడి 17 మెడికల్ కాలేజీలు ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చారన్నారు. ఆ మెడికల్ కాలేజీ లన్నీ ప్రారంభమయ్యే దశలో ఉంటే అవన్నీ ఇప్పుడు ప్రైవేటుపరం చేయాలని ఈ కేబినెట్ నిర్ణయం తీసుకున్నారని విచారం వ్యక్తం చేశారు.

గురువులకు సత్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ముత్యాలంపాడు అజయ్ హైస్కూల్‌లో శుక్రవారం రాయల్స్ క్లబ్ అసోసియేషన్, రాయల్స్ క్లబ్ నారీ శక్తి ఆధ్వర్యాన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నారీశక్తి నాయకులు ఏపుగంటి లక్ష్మీఅపర్ణ మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాత అత్యంత ప్రాధాన్యం గురువుకు మాత్రమే ఉందన్నారు. గురువుల మార్గదర్శకంలో నిర్దేశించిన లక్ష్యాలు సులభంగా చేరుకోవచ్చని తెలిపారు. మంచి సమాజస్థాపనలో గురువు పాత్ర అత్యంత కీలకమన్నారు. అటువంటి గురువులను సత్కరించుకోవటం కనీస బాధ్యతగా గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.


ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

గురువుతోనే సమాజ అభివృద్ధి

మధురానగర్(విజయవాడసెంట్రల్): గురువుతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఆలయ కమిటీ, పి.సుబ్బరామిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులకు సత్కారం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలోను గురువుల పాత్ర కీలకం అన్నారు. తన తండ్రి సుబ్బరామిరెడ్డి అడుగుజాడలలో తాను ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ఆకాంక్షించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. మందిర వ్యవస్థాపక సభ్యురాలు వసుంధర, పి. సుబ్బరామిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు, డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మారుతీనగర్‌లో ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఉమ్మడి కృష్ణా జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ఉత్తమ అధ్యాపకుల గ్రహీతలు 45 మందిని శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు గుమ్మడి నారాయణ, ఎం.సంపూర్ణరావు, పి.రవికుమార్, ప్రసాదరెడ్డి, కటికల క్రిస్టోఫర్, టీఎస్ఆర్‌కే ప్రసాద్, మన్నం రాజారావు మాట్లాడారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అధ్యాపకులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

గాయత్రి విద్యాలయంలో టీచర్స్ డే

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక సుందరయ్య నగర్‌ప్రాంతంలో గాయత్రి విద్యా సంస్థలు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పూలబాల వెంకట్ మాట్లాడుతూ సాహిత్యానికి గాయత్రి విద్యాసంస్థ పెద్దపీట వేయడం సంతోషదాయకమన్నారు. గాయత్రి విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.అభిలాష్ మాట్లాడుతూ బహుభాషావేత్త అయిన పూలబాల వెంకట్ ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, ఇటాలియన్, ఇంగ్లీష్, జపనీష్ ఇలా ఆరు అంతర్జాతీయ భాషలను అవపోసన చేసుకున్నారని తెలిపారు. ఆరు విదేశీ భాషల్లో ఇప్పటి వరకు 60 పుస్తకాలను రచించారన్నారు. సరస్వతి సంకీర్తన పుస్తకాన్ని విద్యాలయం డైరెక్టర్ అభిలాష్, ప్రిన్సిపాల్ మంజూష ఆవిష్కరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉపాధ్యాయురాలికి సత్కారం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆలిండియా బీసీటీసీ అనే సంస్థ ఆధ్యాత్మిక బోధనలు చేయడమే కాకుండా, సామాజిక సేవలోనూ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆలిండియా బీసీటీసీ జనరల్ సెక్రటరీ రెవరెండ్ మంగలపూడి జోసఫ్ అన్నారు. సింగ్ నగర్ ప్రాంతంలోని బీసీటీసీ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బేతపూడి గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయులు మద్దాలి రాణిని శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జోసఫ్ మాట్లాడుతూ మానవాళిని క్రీస్తు మార్గంలో నడిపించడానికి బీసీటీసీ చేస్తున్న కృషి ఎనలేనిదని అన్నారు. కోలా డానియేలు, కె.యాహోను తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతిని వెలిగించేది గురువు

విజయవాడ కల్చరల్: భవిష్య మార్గ నిర్దేశకుడు ఉపాధ్యాయుడని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. గురు విశ్వస్ఫూర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని కేఎల్ రావ్ ఇంజినీరింగ్ కార్యాలయంలో గురుపూజోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ జ్ఞానజ్యోతిని వెలిగించేవాడు గురువు అన్నారు. విశ్వస్ఫూర్తి ట్రస్ట్ నిర్వాహకుడు రజనీకాంతరావు మాట్లాడారు. సంస్థ సభ్యులు రత్నకిషోర్, వి.ప్రభావతి పాల్గొన్నారు. నిర్వాహకులు 15 మంది అధ్యాపకులను సత్కరించారు. కళాకారులు ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి.


బహుభాషావేత్త పూలబాల వెంకట్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం


ఉపాధ్యాయ దినోత్సవంలో గుప్తా, అతిథులు


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న బీసీటీసీ జనరల్ సెక్రటరీ మంగలపూడి జోసఫ్

గణనాథుని ఆశీస్సులు ప్రజలందరికీ అందాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయకుని ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని.. ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు అన్నారు. వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా 31వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో శుక్రవారం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గణనాథునికి పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం 4వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు దేవరపు మాల్యాద్రి, కలిగినీడి రామారావు, సుబ్బారావు,నవనీతం సాంబశివరావు, డీ మురళీకృష్ణం రాజు తదితరులు పర్యవేక్షించారు. 30వ డివిజన్ రామకృష్ణాపురం రెండో రోడ్డు ఆర్‌కే ఫెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో గత 18 సంవత్సరాల నుంచి జరుగుతున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నదానం జరిగింది. కార్పొరేటర్ బీహెచ్ ఎస్‌వీ జానారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహులను అభినందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు రామకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి మహోత్సవాలలో భాగంగా మధురానగర్ పప్పులమిల్లు సెంటర్‌లో బోనం నాగు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గణనాథుని ఉంచి మేళతాళాలు, డప్పువాయిద్యాలు, డీజేలతో స్వామివారి ఊరేగింపు పురవీధులమీదుగా సాగింది. దారి పొడవునా భక్తులు స్వామివారికి హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ నాయకులు బోనం నాగు ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పర్యవేక్షించారు.


శ్రీనగర్ కాలనీలో వినాయకునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు


భోజనాలు వడ్డిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి


మధురానగర్‌లో వినాయకుని నిమజ్జనోత్సవంలో ఊరేగింపు

గాదె వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేయాలి

మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్


డీసీపీ సరితను కలిసి వినతి పత్రం అందజేస్తున్న మహిళా సంఘాల ఐక్యవేదిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): న్యాయం కోసం పోరాడుతున్న సుగాలి ప్రీతి తల్లి సుగాలి పార్వతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన నాయకుడు గాదె వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేయాలని మహిళా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డి.రమాదేవి, పి.దుర్గాభవాని, పి.పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐక్యవేదిక ప్రతినిధులు ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సుగాలి పార్వతిని జనసేన నాయకుడు గాదె వెంకటేశ్వరరావుపై బెదిరించారన్నారు. ఒక బాధిత కుటుంబం న్యాయం పోరాటం చేస్తుంటే వారిని కులం పేరుతో ఎగతాళి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పిల్లలు తండ్రి కులాన్నే పొందుతారని తెలిసి కూడా ప్రీతి తల్లిని అవమానించడంపై తీవ్ర భ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జనసేన నాయకుడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రీతి కేసు ను సక్రమంగా దర్యాప్తు చేసి కేసులో నిజానిజాలు తేల్చి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్, ఆయన తల్లి శాలినీదేవిపై అనంతరం పురం టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆయన చేసిన వ్యాఖ్యల ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యిందని, కానీ ఎక్కడా ఆయనపై కేసు నమోదు చేసిన దాఖలాలు లేవన్నారు. మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే ఎందుకు చర్య తీసుకోలేదని అని ప్రశ్నించారు. టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

దసరా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దసరా ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లకు కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం శ్రీకారం చుట్టారు. అర్చకుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి రాట పాతారు. దసరా ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో ప్రజలు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కళాకారుల సేవలను గుర్తించి ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న జగన్మోహనరావు, వేదికమీద బుద్ధప్రసాద్, సుబ్బారావు తదితరులు

విజయవాడ కల్చరల్: కళాకారుల సేవలను గుర్తించి ప్రోత్సహించాలని శ్రీ రామకృష్ణా నాట్యమండలి వ్యవస్థాపకుడు డాక్టర్ జొన్నలగడ్డ రామ్మోహనరావు అన్నారు. రామకృష్ణా నాట్యమండలి స్వర్ణోత్సవం సందర్భంగా సంగీత సాహిత్యాలలో విశేషమైన కృషి చేసిన వారికి సత్కారం, ఏకపాత్రాభినయ పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం, సాంస్కృతిక ప్రదర్శనల కార్యక్రమాన్ని గాంధీనగర్‌లోని కొతా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం నిర్వహించారు. అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ రామకృష్ణా నాట్యమండలి సేవలను కొనియాడారు. వివిధ రంగాలకు చెందిన గుత్తికొండ సుబ్బారావు, ముదిగొండ విశ్వేశ్వర శాస్త్రి, సాహితీవేత్త భవిష్య పాల్గొన్నారు. రామకృష్ణా నాట్యమండలి సహకార్యదర్శి జొన్నలగడ్డ ఆదిలక్ష్మి, కార్యదర్శి జొన్నలగడ్డ శ్రావణ్‌కుమార్ నిర్వహించారు. సాయిశంకర్ భారతీయుడు ఏకపాత్రాభినయం, కె. వాసుదేవరావ్ బృందం కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఏక పాత్రాభినయం పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతితోపాటు జ్ఞాపికలను అందజేశారు. రామకృష్ణా నాట్యమండలి స్వర్ణోత్స వేడుకల సందర్భంగా ప్రముఖ రంగస్థల నటులు, సాహితీవేత్త డాక్టర్ మీగడ రామలింగ స్వామికి రంగస్థల దీప్తి పురస్కారం, సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్‌కు సంగీత దీప్తి , శతాధిక గ్రంథకర్త డాక్టర్ జీవీ పూర్ణచందుకు, సాహిత్య దీప్తి పురస్కారాలు ప్రదానం చేశారు.

ముసాఫిర్‌ఖానాను ప్రైవేటీకరణ చేయవద్దు

పాయకాపురం(విజయవాడరూరల్): పేద ముస్లిం, మైనార్టీ వర్గాల వారు వివాహాలు, చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకునేందుకు ఉపయోగించుకునే ముసాఫిర్‌ఖానాను ప్రైవేటీకరణ చేయవద్దని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగులమీరా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వన్‌టౌన్ లోని ముసాఫిర్‌ఖానాను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. లేదంటే ముస్లిం మైనార్టీల ఆగ్రహానికి గురికాక తప్పదని పేర్కొన్నారు. ఈ సమస్యను నగరంలోని ముగ్గురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి ముసాఫిర్ ఖానాను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించవద్దని విజ్ఞప్తి చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మసీదుల్లో ప్రార్థనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈద్ మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని నగరంలోని మసీదులలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధురానగర్, ముత్యాలంపాడు, మారుతీనగర్, రామకృష్ణాపురం, దేవీనగర్ ప్రాంతాల్లోని మసీదులలో ప్రార్థనలు జరిగాయి. అల్లాకు ప్రీతికరమైన శుక్రవారం కావటంతో పెద్ద సంఖ్యలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.